



చోడవరంలోని పిల్లావారితోట పోలింగ్ కేంద్రానికి వృద్ధురాలిని తీసుకువస్తున్న బంధువు

అచ్యుతాపురం మండలం రామన్నపాలెంలో సోమవారం రాత్రి 7.15 గంటలకు బారులు తీరిన ఓటర్లు



ఓటెత్తిన జనం

జిల్లాలో 70.37 ఓటింగ్ శాతం నమోదు

- ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలు కిటకిట
- పలు చోట్ల రాత్రి వరకు బారులు తీరిన ఓటర్లు
- పలు కేంద్రాల్లో మొరాయించిన ఈవీఎంలు
- స్వల్ప సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతం
- జిల్లాలో అత్యధికంగా అనకాపల్లి నియోజకవర్గంలో 78.96 శాతం..
- అత్యల్పంగా ఎలమంచిలి నియోజకవర్గంలో 61.46 శాతం ఓట్లు నమోదు

జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సోమవారం రాత్రి 9 గంటల వరకు నమోదైన ఓట్ల శాతం వివరాలు

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	శాతం
అనకాపల్లి	2,13,714	1,68,754	78.96
చోడవరం	2,17,484	1,66,809	76.70
మాడుగుల	1,88,989	1,39,166	73.64
నర్సీపట్నం	2,12,046	1,37,691	64.93
పాయకరావుపేట	2,50,744	1,68,072	60.03
ఎలమంచిలి	2,06,394	1,26,844	61.46

అనకాపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఓటర్లు పోటెత్తారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో గతం కంటే భిన్నంగా ఎండను సైతం లెక్క చేయకుండా అధిక సంఖ్యలో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓట్లేశారు. పలు పోలింగ్ కేంద్రాలకు ఉదయం 7 గంటలకే ఓటేసేందుకు జనం పెద్ద సంఖ్యలో తరలి రావడం కనిపించింది. అక్కడక్కడ చెదురుమదురు సంఘటనలు మినహా పోలింగ్‌కు పెద్దగా అవాంతరాలేమీ ఎదురుకాలేదు. సోమవారం రాత్రి 10 గంటల సమయానికి 70.37 శాతం పోలింగ్ నమోదైనట్టు అధికారులు వెల్లడించారు.

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఉండగా అనకాపల్లి పరిధిలో 2019 ఎన్నికల్లో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 81 శాతం పోలింగ్ నమోదైంది. ఈసారి గత ఎన్నికల కంటే పోలింగ్ ఎక్కువగా నమోదయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 1,828 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ క్రమంగా వేగం పుంజుకుంది. ఉదయాన్నే పలు పోలింగ్ కేంద్రాలకు జనం చేరుకొని బారులు చేరారు. ఉదయం 9 గంటల సమయానికి జిల్లాలో 19.11 శాతం పోలింగ్ జరిగింది. 11 గంటల సమయానికి 36.33 శాతం, మధ్యాహ్నం ఒంటిగంటకు ఎండను సైతం లెక్క చేయకుండా ఓటర్లు ఓట్లు వేయడంతో 43.80 శాతానికి పైగా పోలింగ్ నమోదు కాగా, సాయంత్రం 3 గంటల సమయానికి 46.26 శాతం, సాయంత్రం 6 గంటలకు 69.03 శాతానికి చేరింది. రాత్రి 10 గంటల సమయానికి 70.37 శాతం నమోదైంది. జిల్లాలో అన్ని సగానికి పైగా పోలింగ్ కేంద్రాలలో సాయంత్రం 4 గంటల తరువాత ఓటింగ్ వేగం పుంజుకుంది. క్యూలో మహిళలు, యువకులు ఎక్కువగా కనిపించారు. గతానికి భిన్నంగా ఈసారి పల్లెల్లో ఓటర్లు కూడా పెద్ద సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈసారి జిల్లాలో అనకాపల్లి ఎంపీ స్థానానికి 15 మంది అభ్యర్థులు, 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 64 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరి భవితవ్యం ఈవీఎంలలో ఉంది. విజేతలు ఎవరు, పరాజితులు ఎవరనేది జూన్ 4న తేలనుంది.



అనకాపల్లి మండలం కోడూరు పోలింగ్ కేంద్రంలో ఓటు వేసిన కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

పోలింగ్ తీరు పరిశీలన

జిల్లాలో పోలింగ్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి నిశితంగా పరిశీలించారు. కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ఆయన జిల్లాలో అన్ని పోలింగ్ కేంద్రాలలో పరిస్థితులను వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించారు. అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల అధికారులతో అవసరం మేరకు చర్చించి సూచనలు చేశారు.

ఈవీఎంల మొరాయింపు

మాడుగుల నియోజకవర్గం మాడుగులలో 26వ పోలింగ్ కేంద్రం వద్ద సత్యవరం, పొంగలిపాక గ్రామాల్లో ప్రారంభంలో ఈవీఎంలు మొరాయించడంతో అర్ధగంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభించారు. పెందుర్తిలో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ మందకొడిగా సాగింది. చోడవరం నియోజకవర్గం గవరవరంలో ఈవీఎంలు సుమారు రెండు గంటల పాటు మొరాయించడంతో పోలింగ్‌కు అంతరాయం కలిగింది. ఆ తరువాత కొనసాగింది.

ఓటేసిన ప్రముఖులు

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అనకాపల్లి మండలం కోడూరు 149వ పోలింగ్ బూత్‌లో తన ఓటుహక్కును వినియోగించుకున్నారు. బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ కడప జిల్లా ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తిలో తన సతీమణి శ్రీదేవితో కలిసి ఓటు వేశారు. వైసీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలునాయుడు దేవరాపల్లి మండలం తారువా గ్రామంలో తన ఓటుహక్కును వినియోగించుకున్నారు. కూటమి, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు వారి స్వగ్రామాల్లో ఓటుహక్కును వినియోగించుకున్నారు. కాగా జిల్లాలో బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ ఏడు నియోజకవర్గాల్లో పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పెందుర్తి, మాడుగుల, చోడవరం, ఎలమంచిలి, అనకాపల్లి, నర్సీపట్నం నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.



నర్సీపట్నంలోని పోలింగ్ కేంద్రం వద్ద బారులుతీరిన ఓటర్లు



అనకాపల్లి మండలంలోని మధురానగర్‌లో వృద్ధుడిని పోలింగ్ కేంద్రానికి తీసుకువెళుతున్న దృశ్యం

ఓటు వేసేందుకు యువత ఆసక్తి

పలు పోలింగ్ కేంద్రాలలో యువకులు, యువతులు ఓట్లేసేందుకు ఆసక్తి చూపారు. అనకాపల్లి, ఎలమంచిలి, చోడవరం నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ బూత్‌ల వద్ద యువ ఓటర్లు బారులు తీరడం కనిపించింది.

పలుచోట్ల స్వల్ప ఉద్రిక్తతలు

పాయకరావుపేట నియోజకవర్గం ఎస్.రాయవరం కొత్తరేవుపోలవరంలో వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. టీడీపీ మాజీ సర్పంచ్‌కు, ప్రస్తుత సర్పంచ్ వర్గీయుల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు కలుగజేసుకోవడంతో వివాదం సద్దుమణిగింది. తిమ్మాపురం పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ అభ్యర్థి కంబాల జోగులు వైసీపీ జెండాతో వాహనంపై రావడం, పార్టీ కండువా వేసుకోవడంతో కూటమి నాయకులు అభ్యంతరం తెలిపారు. రెండు వర్గాల మధ్య స్వల వాగ్వాదం చోటుచేసుకుంది. ఎలమంచిలి నియోజకవర్గం అచ్యుతాపురం మండలం మోసయ్యపేటలో వైసీపీ, కూటమి పార్టీల మధ్య స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. చోడవరం మండలం గౌరీపట్నం పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య స్వల్ప వివాదం జరిగింది. పోలీసులు కలుగజేసుకొని సర్ది చెప్పడంతో పోలింగ్ కొనసాగింది. రావికమతం మండలం పి.పన్నవోలు గ్రామ పోలింగ్ బూత్‌లో మాజీ వలంటీరును వైసీపీ ఏజెంట్‌గా నియమించడంతో టీడీపీ వర్గీయులు అభ్యంతరం తెలిపారు. సుమారు గంటపాటు పోలింగ్ నిలిపివేశారు. ఎన్నికల అధికారుల సూచనల మేరకు మాజీ వలంటీర్‌ను బయటకు పంపేయడంతో పోలింగ్ కొనసాగింది. చోడవరం పట్టణ పరిధిలో గాంధీ గ్రామం పంచాయతీలో ఒక వృద్ధురాలు ఓటేసి ఇంటికి వెళుతున్న క్రమంలో సొమ్మసిల్లిపడి మృతి చెందింది. అనకాపల్లి నియోజకవర్గం కశింకోట మండలం జోగారావుపేట, నర్సింగిబిల్లి, తీడ గ్రామాల్లో వైసీపీ, కూటమి వర్గీయులు వాగ్వాదానికి దిగారు. వైసీపీ అభ్యర్థి ఓటర్లను పోలింగ్ బూత్ వద్దకు పంపడంతో రెండు వర్గాల మధ్య వివాదం చోటుచేసుకుంది.



రోలుగుంట మండలంలోని పిత్రిగెడ్డ గ్రామం నుంచి ఓటు వేయించడానికి వృద్ధురాలిని డోలీపై అర్లకు తీసుకువస్తున్న దృశ్యం



రావికమతం మండలంలోని చినపాచిల పోలింగ్ కేంద్రం వద్ద ఉదయమే బారులు తీరిన ఓటర్లు

ఎవరి ధీమా వారిది!!

గెలుపుపై కూటమిలో సంపూర్ణ విశ్వాసం

- ఎంపీ అభ్యర్థికి లక్ష మెజారిటీ వస్తుందంటున్న టీడీపీ నేతలు
- విశాఖ జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఆరింటిలో గెలుపు ఖాయమని లెక్కలు
- మూడు అసెంబ్లీ సెగ్మెంట్లపై ఆశలు పెట్టుకున్న వైసీపీ
- ఎంపీ అభ్యర్థులకు క్రాస్ ఓటింగ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి) సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ సోమవారం ముగిసింది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం రాత్రి పది గంటలు దాటిన తరువాత కూడా పోలింగ్ కొనసాగింది. బరిలో కాంగ్రెస్ పార్టీ, స్వతంత్ర అభ్యర్థులు ఎందరు ఉన్నా పోటీ ప్రధానంగా కూటమి (టీడీపీ, జనసేన, బీజేపీ), వైఎస్ఆర్‌సీపీల మధ్యే జరిగింది. పోలింగ్ సరళిని చూసి ఏ పార్టీకి ఆ పార్టీ తమదే విజయమని ధీమా వ్యక్తం చేస్తోంది. ఈసారి కొత్తగా ఓటు హక్కు చాలామందికి వచ్చిందని, యువతరం అంతా చంద్రబాబునాయుడుపై నమ్మకంతో కూటమికే ఓట్లు వేశారని టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు విశ్వసిస్తున్నారు. ఉద్యోగులు, వ్యాపారులు, కార్మికులు అంతా అధికార పార్టీ విధానాలతో విసుగెత్తిపోయి ఉన్నారని, వారంతా కూటమి వెంటే ఉన్నారని చెబుతున్నారు. అయితే మహిళలు పెద్దఎత్తున పోలింగ్‌కు తరలి వచ్చారని, అలాగే వృద్ధులు కూడా ఓపిక చేసుకొని వచ్చారని, వారి ఓట్లు తమకే పడతాయని వైసీపీ భావిస్తోంది. విశాఖ ఎంపీ

... మిగతా 8వ పేజీలో

అనకాపల్లి జిల్లాలో గెలుపెవరిదో?

- ఎంపీతో పాటు ఏడు అసెంబ్లీ స్థానాలు తమవేనన్న ఆత్మవిశ్వాసంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు



సీఎం రమేశ్



బూడి ముత్యాలనాయుడు

అనకాపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం జరిగిన పోలింగ్ సరళిని బట్టి ప్రధాన పార్టీల అభ్యర్థులు గెలుపుపై అంచనాలు వేసుకుంటున్నారు. ఎంపీ స్థానంతో పాటు ఏడు అసెంబ్లీ స్థానాలు తమవేనని కూటమి అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే సంక్షేమ పథకాలు తమను ఆదుకుంటాయని వైసీపీ అభ్యర్థులు నమ్మకంతో ఉన్నారు. అయితే ఈసారి ఓటింగ్ సరళిని చూస్తే ఉద్యోగులు, యువత అధిక సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొనడంతో వైసీపీకి ఎదురు దెబ్బ తప్పదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

రాజ్యసభ సభ్యుడిగా పనిచేసిన అనుభవం, కేంద్రంలో బీజేపీ పెద్దలతో తనకున్న సంబంధాలతో ఈ ప్రాంతంలో పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని, అనకాపల్లి అభివృద్ధికి కృషిచేస్తానని బీజేపీ అభ్యర్థి సీఎం రమేశ్ హామీ ఇవ్వడంతో ఓటర్ల నుంచి సానుకూల స్పందన వచ్చినట్టు కూటమి నాయకులు అభిప్రాయపడుతున్నారు. కాగా మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వరుసగా రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన అనుభవం, అన్ని వర్గాల ప్రజలతో మమేకం కావడంతో విజయం తననే వరిస్తుందని వైసీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడు ధీమాగా ఉన్నారు.

అసెంబ్లీ అభ్యర్థుల్లో కూడా..

కూటమి తరఫున కొణతాల రామకృష్ణ (అనకాపల్లి), పంచకర్ల రమేశ్‌బాబు (పెందుర్తి), సుందరపు విజయ కుమార్(ఎలమంచిలి) నియోజక వర్గాల్లో జనసేన అభ్యర్థులుగా పోటీలో ఉన్నారు. అయ్యన్నపాత్రుడు(నర్సీపట్నం), బండారు సత్యనారాయణమూర్తి (మాడుగుల), కేఎస్ఎన్ఎస్ రాజు(చోడవరం), వంగలపూడి అనిత(పాయకరావుపేట) నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులుగా పోటీలో ఉన్నారు. కూటమి మేనిఫెస్టో అన్ని వర్గాల ప్రజలను ఆకర్షించడంతో ఓటర్లు తమ వైపే మొగ్గు చూపారని

... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

యువకుడిపై వైసీపీ నాయకుల దాడి

- టీడీపీకి అనుకూలంగా పనిచేశాడని ఆగ్రహం
- తీవ్ర గాయాలతో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్సలు
- జేపీ అగ్రహారం గ్రామంలో ఘటన



దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న రామ్‌ప్రసాద్

రోలుగుంట, మే 13: టీడీపీకి అనుకూలంగా పనిచేసి, ఓటు వేశాడనే ఉద్దేశ్యంతో వైసీపీకి చెందినవారు పలువురు ఓ యువకుడిపై దాడిచేశారు. తీవ్ర గాయాలకు గురైన సదరు యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సోమవారం రాత్రి మండలంలోని ఓ గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి టీడీపీ నాయకులు తెలిపిన వివరాలివి. జేపీ అగ్రహారం గ్రామానికి చెందిన తమరాన రామ్‌ప్రసాద్ అనే యువకుడు ఐటీఐ పూర్తి చేసి ఓ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నాడు. సోమవారం ఓటు వేయడానికి స్వగ్రామం వచ్చాడు. టీడీపీ నాయకులతో ఉంటూ, ఆ పార్టీకే ఓటు వేశాడని భావించిన వైసీపీకి చెందిన సర్పంచ్ కుమారుడు చిటికెల అనంత్, వబ్బలరెడ్డి శివ అనే ఇద్దరూ రామ్ ప్రసాద్‌ను ఆపారు. నువ్వు టీడీపీకి పనిచేస్తావా.., ఓటు వేస్తావా.. అంటూ కాలర్ పట్టుకుని, కాళ్లతో తన్ని దాడిచేసి తీవ్రంగా గాయపర్చారని టీడీపీ నాయకులు ఆరోపించారు. దీంతో టీడీపీకి చెందిన మాజీ సర్పంచ్ రొంగలి రమణ, ఇతర నాయకులు రామ్‌ప్రసాద్‌ను చికిత్స నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై రోలుగుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డి.సురవరంలో కూటమి-వైసీపీ వర్గీయుల బాహాబాహీ

- టీడీపీ కార్యకర్తకు గాయాలు
- రంగప్రవేశం చేసిన పోలీసులు



తోపులాటలో గాయపడిన టీడీపీ కార్యకర్త రాము

మాడుగుల రూరల్, మే 13: మండలంలోని సాగరం పంచాయతీ డి.సురవరం పోలింగ్ కేంద్రం వద్ద కూటమి, వైసీపీ వర్గీయులు సోమవారం బాహాబాహీకి దిగడంతో తోపులాట చోటుచేసుకుంది. వైసీపీకి చెందిన నాయకులు పోలింగ్ కేంద్రం వద్దకు ఓటర్లను తీసుకు వచ్చి, వైసీపీకి ఓటేయాలని చెప్పడం, బూత్‌లోకి వెళ్లే ప్రయత్నం చేయడం వంటి వాటిని అక్కడి టీడీపీ, జనసేన నాయకులు వారిని అడ్డుకున్నారు. దీంతో మాటా మాటా పెరిగి తోపులాట జరగడంతో టీడీపీ కార్యకర్త బాలిబోయిన రాము నుదుటిపై బైక్ తాళంతో వైసీపీ వర్గీయులు దాడి చేసి గాయపర్చారు. ఇది గుర్తించిన పోలీసులు ఇరువర్గాలను అక్కడి నుంచి పంపివేయడంతో వివాదం సద్దుమణిగింది.

ఓటేసి వస్తూ..మృత్యు ఒడికి చేరిన వృద్ధురాలు

- చోడవరం మండలంలో ఘటన

చోడవరం, మే 13: ఓటు వేయడానికొచ్చిన ఓ వృద్ధురాలు, పోలింగ్ కేంద్రం నుంచి బయటకు వస్తూ మృతిచెందింది. అనకాపల్లి జిల్లా చోడవరం పట్టణ శివారు గాంధీగ్రామం పంచాయతీ సిటిజన్ కాలనీకి చెందిన జయవరపు నాగయ్యమ్మ (75)ను ఓటు వేసేందుకు ఆమె కుటుంబ సభ్యులు సోమవారం మధ్యాహ్నం తమ ఇంటి సమీపంలోని పోలింగ్ కేంద్రానికి తీసుకువచ్చారు. వీల్‌చైర్‌లో వచ్చిన నాగయ్యమ్మ పోలింగ్ కేంద్రం లోపలకు వెళ్లి ఓటేసింది. ఆ తరువాత ఆమెను బయటకు తీసుకుని వచ్చారు. పోలింగ్ కేంద్రం నుంచి బయటకు రాగానే ఆమె కన్నుమూసింది. దీంతో బంధువులు విషాదంలో మునిగిపోయారు. గత రెండు సంవత్సరాలుగా ఆమె అనారోగ్యంతో మంచానికే పరిమితమైంది.

ఓటర్లను తీసుకువెళ్తూ.. వ్యాన్ బోల్తా

15 మందికి తీవ్ర గాయాలు... ముగ్గురి పరిస్థితి విషమం



బోల్తా పడ్డ వ్యాన్... సంఘటనా స్థలంలో గాయాలతో ఉన్న బాధితులు

అరకులోయ, మే 13: ఓటర్లను పోలింగ్ కేంద్రానికి తీసుకువెళ్తున్న ఓ వ్యాన్ అదుపుతప్పి బోల్తా కొట్టింది. దీంతో 15 మందికి తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటనలకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి...

అనంతగిరి మండలంలోని పెదకోట పంచాయతీ సీడివలస, పాటిపల్లి గ్రామాలకు చెందిన 35 మంది ఓటర్లను ఓ వ్యాన్ పోలింగ్ సోమవారం మధ్యాహ్నం బూత్-295కు తరలిస్తున్నది. ఈ క్రమంలో కుడియా వద్దకు వచ్చేసరికి వ్యాన్ అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో పాటిపల్లి వెలమామిడి, సీడివలస గ్రామాలకు చెందిన 15 మంది ఓటర్లను గాయపడ్డారు. పాటిపల్లి గ్రామానికి చెందిన ఉల్లి చిన్న, ఉల్లి ఎండమ్మ, ఉల్లి ఈశ్వరమ్మలకు తలపై తీవ్రంగా గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా మారింది. వీరితో పాటు మరో 12 మందికి గాయాలు కావడంతో పినకోట పీహెచ్‌సికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేయించారు. పరిస్థితి ఆందోళనకంగా ఉన్న ముగ్గుర్ని విశాఖపట్నం కేజీహెచ్‌కే తరలించారు.

ఓటు వేద్దామని బయలుదేరితే...

- రైలు ఆలస్యంతో నిరాశ

విశాఖపట్నం, మే 13 (ఆంధ్రజ్యోతి): ఎంతో దూరం నుంచి ఓటు వేయడానికి బయల్దేరిన వారికి చివరకు నిరాశే మిగిలింది. రైల్వే శాఖ నిర్లక్ష్యంతో సకాలంలో గమ్యస్థానానికి చేరుకోలేక ఓటుకు దూరమయ్యారు. జిల్లాకు చెందిన పలువురు ఉపాధి, ఉద్యోగ రీత్యా నాందేడ్‌లో ఉంటున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఓటు హక్కు ఉపయోగించుకోవాలని నాందేడ్- విశాఖపట్నం సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరారు. ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు అక్కడ బయల్దేరాల్సిన రైలు ఆరు గంటల ఆలస్యంగా బయల్దేరింది. సోమవారం ఉదయం 5.50 గంటలకు సికింద్రాబాద్ చేరింది. షెడ్యూల్ ప్రకారం సోమవారం ఉదయం 9.10 గంటలకు విశాఖ చేరుకోవాలి. ఎక్కడికక్కడే ఆపేయడం వల్ల సికింద్రాబాద్ చేరేసరికి 9 గంటలు ఆలస్యమయింది. ఓటు వేసే అవకాశం కోల్పోతామని ప్రయాణికులు అధికారులకు, రైల్వేస్టేషన్లలో మాస్టర్లకు ఫిర్యాదు చేశారు. కానీ పరిస్థితి మెరుగుపడలేదు. దాంతో వారు వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టారు. తమకు ఎవరైనా సాయం చేయాలని కోరారు. ఎంత రాత్రి అయినా ఓటు హక్కు కల్పించేలా చూడాలని వారంతా వేడుకున్నారు.

చికెన్ ధరలు


బ్యాగ్	రూ.లలో
రైతు ధర	130.00
లైవ్ ధర	150.00
విత్ స్కిన్	270.00
స్కిన్ లెస్	280.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

పోటెత్తిన ఓటర్లు

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం మందకొడిగా ప్రారంభమై సాయంత్రం వరకు అదే రీతిలో కొనసాగింది. ఉదయం 7 గంటల సమయానికే కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరినప్పటికీ ప్రక్రియ వేగవంతం కాకపోవడంతో గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. తొలిసారి ఓటు హక్కు పొందిన యువ ఓటర్లు కూడా ఓటు వేసేందుకు ఉత్సాహం చూపించారు. వారితో పాటు వృద్ధులు, దివ్యాంగులను కేంద్రాలకు తరించిన వారి కుటుంబసభ్యులు దగ్గరుండి మరీ ఓట్లు వేయించారు. చాలాచోట్ల ఈవీఎంల మొరాయింపు, ఓటింగ్ ఆలస్యంగా ప్రారంభం కావడం, ప్రక్రియ నత్తనడకన సాగడంతో రాత్రి 8 గంటల వరకు కేంద్రాల వద్ద ఓటర్లు బారులుతీరి నిల్చునే పరిస్థితి ఎదురయింది.



అచ్యుతాపురం మండలం దిబ్బపాలెం పోలింగ్ కేంద్రంలో బారుల తీరిన ఓటరు



నక్కపల్లి పోలింగ్ కేంద్రంలో క్యూలో నిలబడిన టీడీపీ అభ్యర్థి అనిత



అచ్యుతాపురం మండలం దొప్పెర్లలో నడవలేని స్థితిలో ఉన్న వృద్ధుడిని ఓటు వేయడానికి తీసుకు వెళుతున్న దృశ్యం



పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు



పాడేరు బస్సులో వచ్చిన పోలింగ్ సిబ్బంది



అనకాపల్లి గవరపాలెంలోని ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రంలో బారులుతీరిన ఓటర్లు



కోటవురట్ల మండలంలోని కె. వెంకటాపురం పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు



గొలుగొండ మండలంలోని చీడిగుమ్మల గ్రామంలో ఉదయం ఏడు గంటలకే బారులు తీసిన ఓటర్లు



నర్సీపట్నం: వెంకునాయుడు స్కూల్ వద్ద ఓటు వేసేందుకు ఎండలో క్యూలో ఉన్న ఓటర్లు



పరవాడ మండలం తానాంలో వృద్ధురాలిని పోలింగ్ కేంద్రానికి తీసుకువస్తున్న దృశ్యం



ఎలమంచిలి రైల్వే స్టేషన్ రోడ్డు పోలింగ్ కేంద్రానికి వృద్ధురాలిని తీసుకువస్తున్న యువకుడు



అచ్యుతాపురం మండలం పూడిమడకలో బార్లు తీరిన ఓటర్లు



అరకులోయ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పోలింగ్ బూత్‌ల వద్ద బారులు తీరిన ఓటర్లు



పాయకరావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బారులు తీరిన ఓటర్లు



225 పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ మంత్రి దాడి కుటుంబ సభ్యులు



అరకులోయ: అడవుల్లో నుంచి వృద్ధుడ్ని ఓటు వేయడం కోసం పోలింగ్ కేంద్రానికి డోలీలో మోసుకువస్తున్న బూరుగు, చినకూరెల గ్రామాల గిరిజనులు



ఎలమంచిలి రైల్వే స్టేషన్ రోడ్డు స్కూలు వద్ద తల్లి ఓటు వేసేందుకు వెళ్లడంతో ఉన్న 3 నెలల చిన్నారితో ఓ తండ్రి



దిబ్బపాలెం పోలింగ్ కేంద్రంలో రాత్రి తొమ్మిదిన్నర గంటలు దాటినా కొనసాగిన పోలింగ్


సబ్బవరంలో ఓటింగ్ సరళిని తెలుసుకుంటున్న పంచకర్ల రమేశ్‌బాబు


తుమ్మపాల: మామిడిపాలెంలో బారులు తీరిన ఓటర్లు


వాడచీపురుపల్లి పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

ప్రశాంతంగా పోలింగ్

- బారులు తీరిన ఓటర్లు
- కొన్నిచోట్ల రాత్రి పదిన్నర వరకు సాగిన పోలింగ్
- అక్కడక్కడా ఘర్షణలు..
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదాలు
- ఓటు హక్కును వినియోగించుకున్న అభ్యర్థులు, రాజకీయ నాయకులు
- కోటవురట్ల మండలం కెవెంటాపురంలో పోలీసుల లాఠీచార్జీ

అనకాపల్లి టౌన్, మే 13: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పట్టణంలో సోమవారం ప్రశాంతంగా జరిగింది. నియోజకవర్గంలో సాయంత్రం ఆరు గంటల వరకు 76 శాతం పోలింగ్ జరిగింది. ఉదయం ఏడు గంటల నుంచే అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. పట్టణ 156, 195, 225 పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎం మిషన్లు మొరాయించడంతో కొద్దిసేపు పోలింగ్ నిలిచిపోయింది. టెక్నీషియన్లు హుటాహుటిన చేరుకుని ఈవీఎం మిషన్‌లను పనిచేయించారు. పట్టణంలోని గవరపాలెం 229, 230 పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 9.20 గంటల వరకు పోలింగ్ సాగింది. ఓటు హక్కును వినియోగించుకునేందుకు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ ప్రాంతాల్లోని ఉద్యోగ, వ్యాపారాల్లో ఉన్న వారు సోమవారం ఓటు హక్కును వినియోగించుకున్నారు. అయితే హైదరాబాద్‌లో ఉద్యోగరీత్యా ఉంటున్న నరసింగరావుపేటకు చెందిన దినకర్ కుటుంబసభ్యులకు 2019లో ఓటు వేసినా ఈ దఫా ఎన్నికల్లో వారు ఓట్లు లేకపోవడంతో పోలింగ్ కేంద్రానికి వచ్చిన వారు తీవ్ర అసహనం వ్యక్తం చేసి వెనుదిరగక తప్పలేదు. గవరపాలెంలోని 221 పోలింగ్ కేంద్రంలో జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ తన కుమార్తెలతో ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఐఆర్ గంగాధర్ 156 పోలింగ్ కేంద్రంలో కుటుంబసభ్యులతో కలిసి ఓటు వేశారు. అలాగే 225 పోలింగ్ కేంద్రంలో మాజీ మంత్రి దాడి వీరభద్రరావు దంపతులతో పాటు కుటుంబసభ్యులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనకాపల్లి ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి కుటుంబసభ్యులు 202 పోలింగ్ కేంద్రంలో ఓటు వేయగా, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ గవరపాలెంలోని 217 పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. గవరపాలెంలోని పోలింగ్ బూత్‌లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహకకార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ, వైసీపీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్, అనకాపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి సీఎం రమేష్ తనయుడు రిత్విక్, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు.

అనకాపల్లి రూరల్‌లో.. మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఒకటి రెండు చోట్ల కూటమి, వైసీపీ నాయకుల మధ్య స్వల్ప ఘర్షణలు చోటుచేసుకున్నప్పటికీ పోలీసులు సర్దిచెప్పడంతో పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగింది. మండల వ్యాప్తంగా 29 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ ప్రారంభమై 10:30 గంటల వరకు వేగంగా జరిగినప్పటికీ తర్వాత మధ్యాహ్నం 2:30 గంటల వరకు మందకొడిగా సాగింది. 2:30 గంటలు దాటాక పోలింగ్ వేగం పుంజుకుంది. సాయంత్రం 7గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది.

తుమ్మపాలలో.. అనకాపల్లి మండలంలోని పలు గ్రామాల్లో చెదురుమదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా పోలింగ్ సాగింది. వృద్ధులు, దివ్యాంగులు సైతం తమ కుటుంబ సభ్యుల సాయంతో ఓటు హక్కును వినియోగించుకున్నారు.మామిడిపాలెంలో పోలింగ్ సమయం ముగిసేసరికి దాదాపు 200 మంది వరకు ఓటు వేసేందుకు క్యూలైన్‌లో ఉండడంతో ఓటింగ్ ప్రక్రియను కొనసాగించారు.

మాకవరంలో పీలా, వైసీపీ నేతల వాగ్వాదం

మాకవరంలో పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ నాయకులకు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణకు మధ్య వాగ్వాదం జరిగింది. జనరల్ ఏజెంట్ హోదాలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మాకవరం పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశిస్తుండగా అక్కడున్న పోలీసులు పసుపు రంగు చొక్కాకు అభ్యంతరం తెలుపుతూ అడ్డుకున్నారు. కొద్దిసేపు వారితో మాట్లాడగా అధికారులు అనుమతి ఇవ్వడంతో లోపలకు వెళ్లి పోలింగ్ ప్రక్రియను పరిశీలించి మాజీ ఎమ్మెల్యే పీలా వెనుదిరిగారు. అదే సమయంలో అక్కడే ఉన్న వైసీపీ మండల అధ్యక్షుడు పెద్దిశెట్టి గోవింద మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణతో గొడవకు దిగారు. ఈ సందర్భంగా ఉమ్మడి పార్టీల నాయకులు, వైసీపీ నాయకుల మధ్య తోపులాటలు జరిగాయి. సమాచారమందుకున్న పోలీసులు అక్కడకు వచ్చి ఇరువర్గాలను హెచ్చరించడంతో గొడవ సద్దుమణిగింది. మాకవరం పోలింగ్ కేంద్రంలో దొంగ ఓటు వేసేందుకు ప్రయత్నించిన గ్రామ వలంటీర్‌ను జనసైనికులు అడ్డుకుని పీవోకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన గవర నూకరత్నం పోలింగ్ బూత్ నంబరు 488లో ఉదయాన్నే ఓటు వేసి మరలా మధ్యాహ్నం సీరా లక్ష్మి పేరుతో బూత్ నంబరు 141లో ఓటు వేసేందుకు ప్రయత్నించడంతో బూత్ ఏజెంట్లు అడ్డుకున్నారు. జనసైనికులు పక్కా ఆధారాలతో పీవోకు ఫిర్యాదు చేశారు.

రాంబిల్లిలో.. మండలంలో సోమవారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా సాగింది. ఉదయం 7 గంటలు ప్రారంభమైన పోలింగ్ రాత్రి 8 గంటల వరకు కొనసాగింది. 51 పోలింగ్ కేంద్రాల్లో 42,134 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉండగా సాయంత్రం 5 గంటలు సమయానికి 32,780 మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకున్నారున్నారు. మండలంలో 78 శాతం పోలింగ్ నమోదైంది. కొన్ని గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించడంతో 7:30 గంటల ప్రాంతంలో పోలింగ్ ప్రారంభించారు. వాడనర్సాపురం, కొత్తపట్నం, పెదకలవలాపల్లి తదితర గ్రామాల్లో స్వల్ప ఘర్షణలు చోటుచేసుకోవడంతో సీఐ లక్ష్మణరావు సిబ్బందితో కలిసి సర్దుబాటు చేశారు.

ఎలమంచిలిలో.. మండలంలో స్వల్ప వివాదాలు మినహా పోలింగ్ ప్రశాంతంగా సాగింది. పలు పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 8 గంటల వరకూ ఓటర్లు బారులు తీరారు. సాయంత్రం 6 గంటలకు 67.98 శాతం ఓటింగ్ జరిగినట్టు అధికారులు తెలిపారు. ఎలమంచిలి పట్టణంలో ఉదయం 7 గంటలకే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తులసీనగర్, మునిసిపాలిటీ పెదపల్లి పోలింగ్ కేంద్రాలు వద్ద స్వల్ప వివాదాలు మినహా ప్రశాంతంగా సాగింది. సాయంత్రం 6 గంటలు దాటిన తరువాత పెదపల్లి, సోమలింగపాలెం, ఏటికొప్పాక, యర్రవరం, పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వీరభద్రస్వామి ఆలయ ప్రాంతం పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేసేందుకు ఓటర్లు బారులు తీరారు. ఏటికొప్పాకలో రాత్రి 7.30 గంటలు వరకూ పోలింగ్ కొనసాగింది. పెదపల్లి, యర్రవరం ప్రాంతాల్లో రాత్రి 8 గంటలు వరకూ పోలింగ్ కొనసాగింది. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైన ఉదయం 9 గంటల వరకు 6.62 శాతం పోలింగ్ నమోదైంది. సాయంత్రం ఆరు గంటలకు 67.98 శాతం ఓటింగ్ నమోదైంది.

పరవాడలో.. మండల వ్యాప్తంగా సోమవారం నిర్వహించిన పోలింగ్ చెదురుమదురు ఘర్షణలు మినహా ప్రశాంతంగా జరిగింది. భరిణికం పోలింగ్‌బూత్ 227లో ఈవీఎంలు మొరాయించడంతో ఉదయం ఎనిమిదిన్నర గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం పోలింగ్ కేంద్రాల బయట టెంట్‌లు ఏర్పాటు చేయకపోవడంతో ఎండలోనే గంటల కొద్ది ఓటర్లు నిలబడాల్సి వచ్చింది. భరిణికం పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ నేతలు ప్రచారం చేయడంపై కూటమి నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి దంపతులు వెన్నెలపాలెంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. పెందుర్తి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు రాజేష్‌కుమార్ పరవాడ, పందివానిపాలెం బూత్‌లను సందర్శించారు.

దిబ్బపాలెంలో తొమ్మిదిన్నర గంటల దాటినా పోలింగ్

ముత్యాలమ్మపాలెం పంచాయతీ శివారు దిబ్బపాలెంలో సోమవారం రాత్రి తొమ్మిదిన్నర గంటలు దాటినా పోలింగ్ కొనసాగింది. ఇక్కడి బూత్‌లో ఈవీఎం తరచూ మొరాయించడంతో పోలింగ్ ఆలస్యమైంది. ఓటర్లంతా పోలింగ్ కేంద్రం వద్ద ఉండిపోవాల్సి వచ్చింది. ఈ ప్రక్రియ పూర్తయ్యేసరికి 10.10 గంటలు అయింది.

కోటవురట్లలో.. మండలంలో ఎన్నికలు చెదురుమదురు ఘర్షణలు నడుమ ఎన్నికలు సాగాయి. లింగాపురం 38 పోలింగ్ బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. మధ్యలో మరోసారి ఈవీఎం మొరాయించడంతో పోలింగ్ గంట సేపు నిలిచిపోయింది. కె.వెంకటాపురం పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ, వైసీపీ కార్యకర్తలకు మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పోలింగ్ బూత్ వద్ద ఏజెంట్ విషయంలో టీడీపీ నాయకుడు తిరుమలరావుకు, వైసీపీ నాయకుడు పైల రమేష్ మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులు ఎంత చెప్పినప్పటికీ ఇరువర్గాలు శాంతించలేదు. దీంతో పోలీసులు లాఠీచార్జి చేశారు. గొట్టివాడ, కోటవురట్ల, చౌడువాడ, కైలాసపట్నం గ్రామాల్లో వైసీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య వాగ్వాదం జరగడంతో పోలీసుల జోక్యంతో సద్దుమణిగింది. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు ఎన్నికల సరళిని పరిశీలించారు.


ఎలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బారులు తీరిన ఓటర్లు

మూడు గ్రామాల్లో రాత్రి 9గంటల వరకు పోలింగ్

మండలంలో 11 గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించాయి. లింగాపురం, రామచంద్రపురం, నీలిగుంట గ్రామాల్లో ఉదయం ఏడుగంటలకు ఎన్నికల పోలింగ్ ప్రారంభమైంది. లింగాపురంలో గంట సేపు ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ గంటల తరబడి ఆలస్యమైంది. మరల 12గంటల ప్రాంతంలో మరొకసారి ఈవీఎం మొరాయించడంతో గంట పోలింగ్ నిలిచిపోయింది. సాయంత్రం 5గంటలకు వర్షం పడింది. ఈ కారణాలతో రాత్రి 9గంటల వరకు పోలింగ్ కొనసాగింది. నీలిగుంటలో పోలింగ్‌కేంద్రం గది ఇరుకుగా ఉండడంతో పోలింగ్ నెమ్మదిగా జరిగింది. ఇక్కడ రాత్రి 8.45వరకు పోలింగ్ కొనసాగింది.

నక్కపల్లిలో.. మండలంలో కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య స్వల్ప వివాదాలు తప్ప ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని రాజయ్యపేట, పెదతీనార్ల, దొండవాక, పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు టెంట్లు ఏర్పాటు చేయకపోవడంతో గంటలకొద్దీ ఎండల్లో నిలబడాల్సి వచ్చింది. మండలంలో ఉదయం నుంచి పోలింగ్ మందకొడిగా సాగింది. ఉదయం 9 గంటలకు 6.91 శాతం పోలింగ్ నమోదు కాగా.. 11గంటలకు 11.61శాతం సాయంత్రం 5 గంటలకు 62.38శాతం పోలింగ్ జరిగింది. సాయంత్రం ఆరు గంటలకు కూడా పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటు హక్కు వినియోగించుకున్నారు. మండలంలో పోలింగ్ సరళిని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనిత పరిశీలించారు. నక్కపల్లి పోలింగ్ కేంద్రంలో ఆమె ఓటు హక్కు వినియోగించుకున్నారు. క్యూ లైన్‌లో నిలబడి ఆమె ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆమె నక్కపల్లి, డీఎల్‌పురం గ్రామాల్లో పోలింగ్ సరళిని తెలుసుకున్నారు.

వైసీపీ కండువాతో దర్శనమిచ్చిన జోగులు

ఎస్.రాయవరం: మండలంలోని తిమ్మాపురం పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు మెడలో వైసీపీ కండువాతో పాటు కారుకు పార్టీ జెండాతో వచ్చారు. ఆ సమయానికి అక్కడే ఉన్న జనసేన నాయకుడు శివదత్తు పోలింగ్ కేంద్రం వద్ద పార్టీ కండువాతో ప్రచారం చేసే విధంగా రావడం ఏమిటంటూ ప్రశ్నించారు. దానికి జోగులు మాట్లాడుతూ తన కారుకు అనుమతి ఉన్నదని, ఏదైనా సమస్య ఉంటే ఎన్నికల అధికారులు చెబుతారని బదులిచ్చారు. అక్కడే ఉన్న అడిషనల్ ఎస్పీ దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లారు. ఇందుకు సంబంధించి పిర్యాదు చేయాలని సూచించడంతో జనసేన నాయకుడు శివదత్తు ఫిర్యాదు చేశారు.

మడుతూరులో 50 నిమిషాలు ఆగిన పోలింగ్

అచ్యుతాపురం/రూరల్, మే 13: మడుతూరులో ఒక మహిళ రెండు ఓట్లు వేయకపోవడంతో 50 నిమిషాల పాటు పోలింగ్ ఆగిపోయింది. ఇక్కడ ఒక మహిళ మొదటి ఓటు ఎంపీ అభ్యర్థికి వేసి రెండవ ఓటు వేయకుండా వెళ్లిపోయింది. దీనిని వెంటనే ఎన్నికల సిబ్బంది తెలుసుకోలేకపోయారు. దీంతో ఈవీఎం మరో ఓటుకి సపోర్టు చేయలేదు. దీనిని గమనించిన ఎన్నికల సిబ్బంది ఒక ఓటు వేసి వెళ్లిపోయిన మహిళ గురించి వెతకడం ప్రారంభించారు. ఆమె ఓటు వేసి పొలంలోకి వెళ్లిపోయింది. ఓటర్ల లిస్టులో ఉన్న ఆమె పేరు, ఆమె భర్తపేరు కనుక్కొని పొలంలో ఉన్న ఆమెను తీసుకువచ్చి రెండవ ఓటు వేయించారు. దీంతో సుమారు 50 నిమిషాల పాటు ఓటింగ్ ఆగిపోయింది.

అచ్యుతాపురం/రూరల్‌లో.. మండలంలో సోమవారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పూడిమడకలో 236వ బూత్ ఈవీఎం మొరాయించడంతో 8.30గంటలకు, మోటూరుపాలెంలో ఈవీఎం మొరాయించడంతో 8.45కి ఓటింగ్ ప్రారంభమైంది. మండలంలో పూడిమడక, దిబ్బపాలెం, రామన్నపాలెం, మడుతూరు, దొప్పెర్ల, దోసూరు, చోడపల్లిల్లో ఓటింగ్ మందకొడిగా సాగింది. కాగా మోసయ్యపేటలో ఒక వలంటీర్ జనసేనకు చెందిన ఓటర్‌ని వైసీపీకి ఓటు వేయించడానికి తీసుకువెళ్తుండగా కూటమి సభ్యులు అడ్డుకున్నారు. దీంతో కొట్లాట జరిగి ఇరుపక్షాల వారికి దెబ్బలు తగిలాయి. అలాగే జగ్గన్నపేటలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ పోలింగ్ బూత్‌లోకి వెళ్లగా కూటమి సభ్యులు అడ్డుకున్నారు. పోలింగ్ బూత్‌లోకి వెళ్లడానికి అనుమతి ఉందా? అని నిలదీశారు. ఈసందర్భంగా వైసీపీ, కూటమి సభ్యుల మధ్య కొంతసేపు వాగ్వాదంతో పాటు తోపులాట జరిగింది. పోలీసులను పిలిచే వరకూ ఇక్కడే ఉండాలంటూ తలుపులు మూసేసి సుకుమారవర్మను నిర్బంధించారు. ఈ సమాచారం తెలుసుకున్న వైసీపీ నాయకులు బయట నుంచి గేట్లు విరగ్గొట్టి సుకుమార వర్మను సురక్షితంగా తీసుకు వెళ్లిపోయారు. బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరస్వామి దుప్పితూరులో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

సబ్బవరంలో.. మండలంలో సోమవారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ పలు గ్రామాల్లో సాయంత్రం 7 గంటల వరకూ కొనసాగింది. సబ్బవరం 35 పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించడంతో రాత్రి 8 గంటల వరకూ పోలింగ్ జరిగింది. సబ్బవరం 31, 35 పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎం మిషన్లు నెమ్మదిగా పనిచేయడంతో క్యూ కొనసాగింది. మొగలిపురంలో మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి తన ఓటు హక్కు ను వినియోగించుకున్నారు. పెందుర్తి కూటమి అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు సబ్బవరం, నంగినారపాడు తదితర గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలు సందర్శించి ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ సబ్బవరం, మొగలిపురం, మలునాయుడుపాలెం తదిత ర గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. అమృతపురంలో ఉదయం గంట పాటు ఈవీఎం మొరాయించడంతో 8 గంటలకు ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. గొల్లలపాలెంలో 95 ఏళ్ల వృద్ధురా లు జయంతి వెంకయ్యమ్మ తన ఓటుహక్కును వినియోగిం చుకున్నారు. మొగలిపురం, వెదుళ్లనరవ, తవ్వవానిపాలెం, గొల్లలపాలెం, గంగవరం, రాయపుర అగ్రహారం, వంగలి గ్రామాల్లో ఓటింగ్ రాత్రి 10 గంటల వరకూ పోలింగ్ కొనసాగే అవకాశం ఉందని సీఐ పిన్నింటి రమణ తెలిపారు.

ఎస్.రాయవరంలో.. మండలంలో కొత్త రేవుపోలవరం పోలింగ్ కేంద్రం వద్ద తప్ప మిగతా అన్ని ప్రాంతాల్లో ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయి. మధ్యాహ్నం నుంచి ఎండ తీవ్రత కొంచెం ఎక్కువ ఉండడంతో సాయంత్రం ఓటర్ల తాకిడి పెరగడంతో జేవీ పాలెంలో ఎనిమిది గంటల వరకు పోలింగ్ కొనసాగగా.. ధర్మవరం అగ్రహారం, సోముదేవుపల్లి పోలింగ్ కేంద్రాల వద్ద తొమ్మిదన్నర గంటల వరకు పోలింగ్ కొనసాగినట్టు పోలింగ్ అధికారులు తెలిపారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పి రవిరాజు ఓటు వేశారు.

కశింకోటలో.. మండలంలో పోలింగ్ సోమవారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. కశింకోట పోలింగ్ కేంద్రం 63 వద్ద జరుగుతున్న ఓటింగ్ సరళిని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ పరిశీలించారు. మండలంలోని జోగారావుపేట, నర్సింగబిల్లి, తీడ గ్రామాల్లో వైసీపీ, కూటమి కార్యకర్తలు గొడవలు పడ్డారు. జోగారావుపేటలో తోపులాట జరిగింది. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు పోలింగ్ కేంద్రానికి చేరుకొని చెల్లాచెదురు చేశారు. కశింకోటలో వైసీపీ, కూటమి కార్యకర్తలు పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత నెలకొనడంతో సీఐ వినోద్ బాబు వారిని చెల్లాచెదురు చేశారు. జిల్లాలో పలుచోట్ల పోలింగ్ కేంద్రాల వద్ద ఒక హోంగార్డును నియమించడమేమిటని స్థానిక ప్రశ్నిస్తున్నారు.

పాయకరావుపేట/రూరల్‌లో.. పాయకరావుపేటలో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పట్టణంలోని 61 నంబరు కేంద్రంతో పాటు మరో రెండు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు కొద్దిసేపు మొరాయించడంతో అరగంట ఆలస్యంగా ప్రారంభమైంది. మధ్యాహ్నం 1 గంటకు 32.22 శాతం ఓట్లు పోలవగా.. 3 గంటలకు 46.30 శాతం దాటింది. సాయంత్రం 5.30కి పట్టణంలో పలు పోలింగ్ కేంద్రాలు ఓటర్లు లేక ఖాళీగా కనిపించాయి.

మండలంలో సీతారాంపురం, నామవరం, గోపాలపట్నం, మాసాహెబ్‌పేట, సత్యవరం, శ్రీరాంపురం, రాజవరం తదితర గ్రామాల్లో సాయంత్రం 6 గంటలకు వరకు పోలింగ్ కొనసాగింది. రాత్రి 7 గంటలకు 67.42 శాతం ఓట్లు పోలవగా.. పాల్తేరులో రాత్రి 7 గంటల వరకు క్యూలైన్లో ఓట్లరు వేచి ఉన్నారు. కుమారపురంలో రాత్రి 8 గంటలకు ఓటింగ్ జరుగుతుందేనని చెబుతున్నారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థిని వంగలపూడి అనిత, వైసీపీ అభ్యర్థి కంబాల జోగులు పాయకరావుపేట పట్టణంతోపాటు మండలంలో పలు గ్రామాల్లో పోలింగ్ సరళిని పరిశీలించారు.


అనకాపల్లి కొత్తూరులో బారులు తీరిన ఓటర్లు


రాంబిల్లి: కొత్తపట్నంలో పోలింగ్ బూతుల వద్ద బారులు తీరిన ఓటర్లు

ఓటేసిన నేతలు



ఓటు వేసిన గండి బాబ్జీ, పీలా గోవింద


అనకాపల్లిలో ఓటేసిన కొణతాల రామకృష్ణ, కుమార్తెలు


ఓటేసిన బండారు దంపతులు


ఓటు వేసిన వంగలపూడి అనిత, కుమారుడు


ఓటు వేసిన దాడి రత్నాకర్ దంపతులు


ఓటు వేసిన సుందరపు విజయకుమార్

అనకాపల్లి జిల్లాలో గెలుపెవరిదో?

... 5వ పేజీ తరువాయి

టీడీపీ, జనసేన అభ్యర్థులు అంచనా వేస్తున్నారు. అయితే సంక్షేమ పథకాలు తమను గెలిపిస్తాయని వైసీపీ అభ్యర్థులు మలసాల భరత్‌కుమార్(అనకాపల్లి), కన్నబాబురాజు(ఎలమంచిలి), కరణం ధర్మశ్రీ(చోడవరం), పెట్ల ఉమాశంకర్ గణేశ్(నర్సీపట్నం), కంబాల జోగులు(పాయకరావుపేట), ఈర్లె అనురాధ(మాడుగుల), అదీప్‌రాజ్(పెందుర్తి) నమ్మకంతో ఉన్నారు. జిల్లాలో ఎవరు విజయం సాధిస్తారనే దానిపై జోరుగా చర్చ సాగుతోంది.

పాడేరు, అరకులోయల్లో అదే ధీమా

పాడేరు, మే 13 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో పాడేరు, అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గాల్లో తమ పార్టీకి ఎంత మేరకు ఓట్లు పడ్డాయనే అంచనాలను రూపొందించడంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు, శ్రేణులు నిమగ్నమయ్యారు. అలాగే ఎవరికి వాళ్లు తమదే గెలుపనే ధీమాతో ఉన్నారు. కాగా పాడేరు అసెంబ్లీ స్థానంలో కూటమి గెలుపు ఖాయమని టీడీపీ అభ్యర్థి గిడ్డి ఈశ్వరి పేర్కొంటున్నారు. అయితే తాను అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తానని వైసీపీ అభ్యర్థి విశ్వేశ్వరరాజు ధీమా వ్యక్తం చేస్తున్నారు. జగన్ పాలనపై వ్యతిరేకత, గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి లేకపోవడం, వైసీపీ అభ్యర్థికి నియోజకవర్గంపై సంపూర్ణ పట్టులేకపోవడం, సీనియర్ నేతల సహాయ నిరాకరణ వంటి అంశాలతో పాటు తమ అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్, కూటమి మేనిఫెస్టో ప్రభావం, కూటమి శ్రేణుల కృషి తనకు కలిసొస్తుందని టీడీపీ అభ్యర్థి అభిప్రాయపడుతున్నారు. అలాగే పలువురు అంచనాలు సైతం పాడేరులో టీడీపీ పాగా వేస్తుందనే అంటున్నారు.

అరకులోయలో..

అరకులోయ అసెంబ్లీ స్థానంలో వైసీపీ రెబల్, స్వతంత్ర అభ్యర్థుల ప్రభావంతో ఓట్లలో చీలిక కారణంగా ఎవరు గెలుస్తారనేది కచ్చితంగా చెప్పలేని పరిస్థితి నెలకొందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. వైసీపీ అభ్యర్థి రేగం మత్స్యలింగం సామాజిక వర్గానికి చెందిన వాళ్లయిన బీజేపీ అభ్యర్థి పాంగి రాజారావు, స్వతంత్ర అభ్యర్థి సివేరి అబ్రహం పోటీలో ఉండడంతో భారీగా చీలాయని తెలుస్తున్నది.

మరో సామాజిక వర్గానికి చెందిన కాంగ్రెస్ అభ్యర్థి శెట్టి గంగాధరస్వామి, మరో స్వతంత్ర అభ్యర్థి సమర్థ రఘునాథ్‌లు సైతం వైసీపీ ఓట్లను భారీగానే చీల్చారని అంటున్నారు. దీంతో ఎవ రెవరికి ఎన్ని ఓట్లు పడ్డాయనేది కచ్చితంగా అంచనా వేయలేకపోతున్నారు. దీంతో గెలుపు ఎవరిదనే విషయం తెలియడం లేదంటున్నారు. కానీ కూటమి శ్రేణుల సహకారంతో తాను గెలుస్తానని పాంగి రాజారావు అంటుండగా, నియోజకవర్గంలో తమ పట్టుసడల లేదని, తమదే విజయమని వైసీపీ అభ్యర్థి రేగం మత్స్యలింగం అంటున్నారు. ఇలా ఎవరికి వాళ్లే గెలుస్తామనే ధీమాతో ఉన్నారు. అయితే ఈసారి ఎన్నికల్లో ఓటింగ్ శాతం తగ్గడం సైతం ఎవరికి లాభిస్తుందో... ఎవర్ని ముంచేస్తుందోననే చర్చ మన్యంలో జోరుగా జరుగుతున్నది.

కోడూరులో కలెక్టర్ ఓటు హక్కు వినియోగం

అనకాపల్లి రూరల్, మే 13: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని, ప్రతి ఒక్కరూ ఓటు వేసే ముందు ఆలోచించి సమర్థుడైన పాలకుడిని ఎన్నుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు రవి పట్టన్‌శెట్టి అన్నారు. సోమవారం కోడూరు పోలింగ్ బూత్ నంబరు 149లోని ఆయన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమర్థుడైన పాలకుడిని ఎన్నుకున్నపుడే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందన్నారు.

ప్రజలంతా కూటమి వైపే : సుందరపు

ఎలమంచిలి, మే 13: ప్రజలంతా కూటమి వైపే ఉన్నారని, ఏ ప్రాంతానికి వెళ్లినా సరే కూటమికి జై కొడుతున్నారని జనసేన ఎలమంచిలి అసెంబ్లీ అభ్యర్థి సుందరపు విజయకుమార్ అన్నారు. సోమవారం ఆయన ఎలమంచిలిలో పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ప్రజలంతా వైసీపీకి వ్యతిరేకంగా ఉన్నారని, కూటమి పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించనున్నారని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నో త్యాగాలు చేసినందుకు ప్రజలు తీర్పు కూటమి వైపు ఉంటుందన్నారు. ఎలమంచిలి నియోజకవర్గంలో విజయం సాధించి తీరుతామన్నారు.

బోసిపోయిన తాళ్లపాలెం వారపు సంత

కశింకోట, మే 13 : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సోమవారం జరిగే తాళ్లపాలెం వారపు సంత కొనుగోలుదారులు లేక వెలవెలబోయింది. దీంతో వ్యాపారస్తులు తీసుకొచ్చిన సరుకులు అమ్మకం కాకపోవడంతో మధ్యాహ్నానికే తిరుగుముఖం పట్టారు. ప్రతీ వారం కొనుగోలుదారులతో రద్దీగా ఉండే సంత పరిసర ప్రాంత మార్గాలన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి

జోగులుపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తా : అనిత

నక్కపల్లి, మే 13: వైసీపీ అభ్యర్థి కంబాల జోగులపై తాను ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తానని టీడీపీ పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత చెప్పారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ.. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన ఎన్నికల రోజు ఎన్నికల నియమావళిని పాటించలేదన్నారు. కారుకు పార్టీ జెండా, మెడలో పార్టీ కండువా వేసుకుని పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్లడం ఏమిటని ప్రశ్నించారు. అనంతరం టీడీపీ నాయకులతో ఓటింగ్ సరళిపై చర్చించారు. సోమవారం ఉదయం టీడీపీ అభ్యర్థిని వంగలపూడి అనిత ఉపమాక వెంకన్నను దర్శించుకున్నారు.

కొత్త రేవుపోలవరంలో కొట్లాట


కొత్త రేవుపోలవరం పోలింగ్ కేంద్రం సమీపంలో కొట్లాట

ఎస్. రాయవరం, మే 13: మండలంలోని కొత్త రేవుపోలవరం పోలింగ్ కేంద్రం సమీపంలో సోమవారం మాజీ సర్పంచ్ చోడిపల్లి బంగారి, ప్రస్తుత సర్పంచ్ మల్లె లోవరాజు మధ్య చోటు చేసుకున్న ఘర్షణ కొట్లాటకు దారి తీసింది. మాజీ సర్పంచ్ బంగారి పోలింగ్ కేంద్రం వద్దకు వెళుతున్న సమయంలో సర్పంచ్ మల్లె లోవరాజు వర్గీయుడు ఏదో అనడంతో దానికి బంగారి ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకొంది. ఈ సందర్భంగా సర్పంచ్ లోవరాజు, మాజీ సర్పంచ్ బంగారి మధ్య ఘర్షణ ఇరువర్గాల మధ్య కొట్లాటకు దారి తీసింది. విషయం తెలుసుకున్న సీఐ అప్పన్న, ఎస్‌ఐ విభీషణరావు వెంటనే వెళ్లి ఇరువర్గాలకు హెచ్చరికలు జారీ చేశారు. సర్పంచ్, మాజీ సర్పంచ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయంపై ఎస్‌ఐ విభీషణరావును వివరణ కోరగా.. కొట్లాకు సంబంధించి విచారించడం జరుగుతుందని బదులిచ్చారు.

ఎవరి ధీమా వారిది!!

... 5వ పేజీ తరువాయి

అభ్యర్థిగా కూటమి తరపున పోటీ చేసిన టీడీపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్ కనీసం 50 వేల నుంచి లక్ష ఓట్ల మెజారిటీతో గెలుస్తారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎంపీ అభ్యర్థులకు రెండు పార్టీలలోను క్రాస్ ఓటింగ్ జరిగినట్టు సమాచారం. భీమిలి, గాజువాక, విశాఖ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో కొందరు ఓటర్లు ఎమ్మెల్యే అభ్యర్థికి ఒక పార్టీకి ఓటు వేసి, ఎంపీ అభ్యర్థికి వేరే పార్టీకి వేసినట్టు ప్రచారం జరుగుతోంది. నగరంలో చాలా మంది వైసీపీ అభిమానులు ఎమ్మెల్యే ఓటు ఆ పార్టీకే వేసి ఎంపీ ఓటు టీడీపీకి వేసినట్టు చెబుతున్నారు.

విశాఖ తూర్పులో హోరాహోరీ

విశాఖ తూర్పు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు కనీసం 20 వేల ఓట్ల మెజారిటీతో గెలిచి హ్యాట్రిక్ సాధిస్తారని ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి. అయితే వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఎంవీవీ సత్యనారాయణకు ఓటమి చరిత్ర లేదని, ఆయనే తూర్పులో విజయం దక్కించుకుంటారని ఆయన వర్గం ఘంటాపథంగా చెబుతోంది.

భీమిలిలో గంట మోగనుందా?

భీమిలిలో టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు భారీ మెజారిటీతో గెలుస్తారని ఆ పార్టీ నాయకులు అంటున్నారు. జిల్లాలో ఆయనకే ఎక్కువ మెజారిటీ వస్తుందని ధీమా వ్యక్తంచేస్తున్నారు. అయితే అదంతా ప్రచారమేనని వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు గెలుపు ఖాయమని వైసీపీ పెద్దలు అంటున్నారు.

గాజువాకలో పల్లాకు మొగ్గు

గాజువాకలో వైసీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్‌కు పరాభవమే మిగులుతుందని, టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు విజయం ఖాయమైపోయిందని విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. మంత్రిగా ఉండి అమర్‌నాథ్ జిల్లాకు ఏమీ చేయలేకపోయారనే విమర్శలు ఉన్నాయి.

పశ్చిమంలో టైట్ ఫైట్

పశ్చిమ నియోజవర్గంలో టీడీపీ, వైసీపీ అభ్యర్థుల మధ్య గట్టి పోటీ జరిగింది. ఇక్కడ మూడోసారి ఎమ్మెల్యేగా గెలవాలని టీడీపీ అభ్యర్థి గణబాబు సర్వశక్తులు ఒడ్డగా, ఎలాగైనా విజయం సాధించి ఈసారి శాసనసభకు వెళ్లాలని వైసీపీ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ గట్టి ప్రయత్నమే చేశారు. ఎక్కడా ఖర్చుకు వెనుకాడలేదు. మల్కాపురం, సింధియా తదితర పారిశ్రామిక ప్రాంత ప్రజలు ఎవరికి అండగా నిలిస్తే వారే గెలుస్తారనేది టాక్. ఇద్దరిలో ఎవరు గెలిచినా అతి తక్కువ ఓట్ల మెజారిటీయే ఉంటుందని సమాచారం.

ఉత్తరంలో ఓట్లను చీల్చిన జైభారత్

విశాఖ ఉత్తర నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు, వైసీపీ అభ్యర్థి కేకే రాజు గెలుపు కోసం హోరాహోరీ పోరాటం చేశారు. అయితే ఇక్కడ జైభారత్ పార్టీ తరఫున వీవీ లక్ష్మీనారాయణ పోటీలో నిలిచారు. ఆయన చీల్చే ఓట్లు తీవ్ర ప్రభావం చూపనున్నాయి.

విశాఖలో జనసేన జెండా రెపరెపలు

విశాఖ జిల్లాలో ఈసారి జనసేన జెండా ఎగురుతుందని ఆ పార్టీ వర్గాలు ఆనందం వ్యక్తంచేస్తున్నాయి. దక్షిణ నియోజకవర్గంలో ఆ పార్టీ తరఫున పోటీ చేస్తున్న వంశీకృష్ణ శ్రీనివాస్ తొలుత కాసింత ఇబ్బంది ఎదుర్కొన్నా ఆ తరువాత బాగా పుంజుకున్నారు. టీడీపీ సహకారంతో పాటు వైసీపీ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే వ్యతిరేకులు కలిసి రావడం అదృష్టంగా మారింది.

పెందుర్తిలో సామాజిక వర్గాల వారీగా చీలిక

పెందుర్తి నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు, వైసీపీ అభ్యర్థి అదీప్ రాజుల మధ్య నువ్వా?, నేనా? అనే పోటీ జరిగినట్టు చెబుతున్నారు. నియోజకవర్గంలోని మండలాల్లో ఓటర్లు సామాజికవర్గాలకు ప్రాధాన్యమిస్తూ తమ వారికి అనుకూలంగా ఓటింగ్ చేశారు. అధికార పార్టీ అభ్యర్థిపై తీవ్రమైన భూకబ్జాల ఆరోపణలు ఉన్నందున అవే తనకి ప్లైనస్‌గా మారాయని చెబుతున్నారు. పంచకర్లకు టీడీపీ నుంచి బలమైన సాయం ఉండటంతో జనసేనకి జై కొట్టిస్తారని అంటున్నారు.


మాడుగులలో ఓట్లు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు


రోలుగుంట మండలం జె.నాయుడుపాలెంలో...


మాడుగుల మండలం వీరనారాయణంలో...


బుచ్చెయ్యపేట : ఓటు వేసేందుకు ప్రత్యేక బస్సుల ద్వారా దిబ్బిడి తీసుకొచ్చిన ఓటర్లు

ఉరకలెత్తే ఉత్సాహంతో ఓటు

- నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో ప్రశాంతంగా పోలింగ్
- పలు గ్రామాల్లో వైసీపీ, టీడీపీ మధ్య ఘర్షణలు
- కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో ఆలస్యం
- ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే అభ్యర్థులు

నర్సీపట్నం, మే 13 : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో ప్రశాతంగా జరిగింది. అక్కడక్కడ టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య స్వల్ప ఘర్షణలు చోటు చేసుకున్నాయి. నర్సీపట్నం వెంకునాయుడుపేట ఎంపీపీ స్కూల్‌లోని 179, 180 పోలింగ్ కేంద్రాలలో 7-15 గంటలకు పోలింగ్ మొదలు పెట్టారు. 179 పోలింగ్ కేంద్రంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలింగ్ నత్తనడక సాగడంతో గంటల తరబడి క్యూలో నిలబడ లేక ఓటర్లు ఇబ్బంది పడ్డారు. స్కూల్ భవనం ముందు చిన్న టెంట్ ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. బలిఘట్టంలోని 146, 147, 150 పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో కొద్ది సేపు పోలింగ్‌కు ఆటంకం కలిగింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తురకబడి)లోని 156 పోలింగ్ కేంద్రంలో వలంటీర్‌ని వైసీపీ ఏజెంట్‌గా పెట్టడంతో టీడీపీ ఏజెంట్ కర్రి భాస్కరరావు అభ్యంతరం వ్యక్తం చేసి పీవోకి ఫిర్యాదు చేశారు. వలంటీర్‌ని పీవో బయటకు పంపించేశారు. ఈ నేపథ్యంలో మునిసిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, టీడీపీ ఏజెంట్ భాస్కరరావుల మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. జిల్లా పరిషత్ బాలికోన్నత పాశాలలోని 161 పోలింగ్ కేంద్రంలో కూడా వలంటీర్‌ని వైసీపీ ఏజెంట్‌గా పెట్టడంతో టీడీపీ నాయకులు పీవోకి ఫిర్యాదు చేశారు. శివపురం పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ మహిళా నాయకురాలు కొణతాల అన్నపూర్ణ, టీడీపీ మాజీ కౌన్సిలర్ పైల గోవిందల మధ్య గొడవ జరిగింది. పెదబొడ్డేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య వాగ్వాదం జరగడంతో డీఎస్పీ మోహన్ ఇరువర్గాలను చెదరగొట్టారు. ఎస్పీ మురళీకృష్ణ పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటు వేసిన తర్వాత పోలింగ్ సెంటర్‌లో ఎవర్నీ ఉంచ వద్దని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల పరిశీలకుడు దల్జిత్ సింగ్ మంగత్, ఆర్వో హెచ్‌వీ జయరాం పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.

నర్సీపట్నం అర్బన్ : మండలంలో సోమవారం ప్రశాంతంగా పోలింగ్ ముగిసింది. అక్కడక్కడా స్వల్ప చెదురుముదురు సంఘటనలు మినహా పోలింగ్‌లో ఎక్కడా ఎటువంటి అవాంతరాలు చోటుచేసుకోలేదు. ఉదయం ఏడు గంటల నుంచే ఓటర్లు ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద బారులుతీరి కనిపించారు. మాజీ ఎమ్మెల్యే బోళం ముత్యాలపాప వేములపూడిలో, జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ ధర్మసాగరంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా అడిషినల్ ఎస్పీ బి.విజయ భాస్కర్ వేములపూడి, చెట్టుపల్లి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.

మాకవరపాలెం : మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. స్వల్ప వాగ్వాదాలు మినహా ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. శెట్టిపాలెంలో టీడీపీ నాయకులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. జి.కోడూరులో వికలాంగులను వీల్‌చైర్లలో పోలింగ్ కేంద్రాలకు తరలించారు. నగరం గ్రామంలో బీఎల్‌వోగా విధులు నిర్వహిస్తున్న పార్వతి ఎంత తీవ్రతకు సొమ్మసిల్లిపోవడంతో పీహెచ్‌సీకి తరలించి చికిత్సలు అందజేశారు. పెద్దిపాలెం, బుచ్చన్నపాలెం గ్రామాల్లో టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు రంగ ప్రవేశంతో అక్కడి నుంచి రెండు వర్గాల నాయకులు పరుగులు తీశారు. జి.కోడూరు, లచ్చన్నపాలెం, శెట్టిపాలెం, నగరం, తాడపాల, పెద్దిపాలెం తదితర గ్రామాల్లో పోలింగ్ మందకొడిగా సాగింది. రామన్నపాలెంలో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని ఎస్పీ మురళీకృష్ణ పరిశీలించారు. ఇదిలా వుంటే, రాత్రి ఎనిమిది గంటలు అవుతున్నా జి.కోడూరు, లచ్చన్నపాలెం, పెద్దిపాలెం, తాడపాల, పాపయ్యపాలెంలలో పోలింగ్ కొనసాగుతుంది.

నాతవరం : చెదురుమదురు సంఘటనలు మినహా మండలంలో సోమవారం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. నాతవరంలో కొందరు దొంగ ఓట్లు వేసి తమకు ఓటు లేకుండా చేశారని పలువురు ఓటర్లు ఆరోపించారు. పి.జగ్గంపేటలో టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య గొడవలు జరగ్గా, టీడీపీ కార్యకర్తకు గాయమైంది. అలాగే, వృద్ధులను వాహనాల ద్వారా పోలింగ్ కేంద్రాలకు తీసుకువచ్చి ఓటు వేయించారు.

గొలుగొండ/ కృష్ణాదేవిపేట : మండలంలో పోలింగ్ ప్రశాంతగా జరిగింది. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం ఆరుగంటలకు ముగిసింది. నాగాపురంలో పోలింగ్ సిబ్బంది నెమ్మదిగా ఓటింగ్ ప్రక్రియ సాగించడంతో ఓటర్లు నేలపై గంటల తరబడి కుర్చొన్నారు. ఏఎల్‌పురంలో గల పోలింగ్ బూతుల్లో సరళని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అయ్యన్న పరిశీలించారు.

చోడవరం నియోజకవర్గంలో...

చోడవరం, మే 13 : ఈవీఎంల మొరాయింపు, ఒకటి రెండు స్వల్ప వివాదాలు మినహా చోడవరం మండలంలో సోమవారం ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. గవరవరంలో ఏర్పాటు చేసిన రెండు బూత్‌లలో ఒక బూత్‌లోని ఈవీఎం కొద్దిసేపు పనిచేసిన అనంతరం మొరాయించింది. దీనితో పోలింగ్ ఆగిపోయింది. ప్రత్నామ్యాయంగా ఇచ్చిన ఈవీఎం కూడా పనిచేయక పోవడంతో సిబ్బంది అధికారులకు సమాచారం ఇవ్వడంతో సాంకేతిక సిబ్బంది వచ్చి సరిచేయడంతో తిరిగి రెండు గంటలు ఆలస్యంగా ఓటింగ్ ప్రారంభమైంది. దీంతో ఓటేయడానికి వచ్చిన వారిలో చాలామంది వెనుదిరిగారు. పోలింగ్ కేంద్రాల వద్ద కనీస స్థాయిలో కూడా ఏర్పాట్లు చేయకపోవడంతో ఓటర్లు చాలా ఇబ్బందులు పడ్డారు. కొన్ని

పోలింగ్ కేంద్రాల వద్దే నేతల ప్రచారం

మండలంలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద కనీస స్థాయిలో కూడా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయకపోవడంతో పోలింగ్ కేంద్రాలలోనే వైసీపీ, టీడీపీలకు చెందిన నాయకులు మకాం వేసి మరీ ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం కనిపించింది. గంధవరం, గవరవరంలాంటి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో సైతం ఒకే ఒక్క కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేయడంతో పోలింగ్ కేంద్రాల వద్ద నేతలను నియంత్రించే పరిస్థితి లేకపోవడంతో ఇరు పార్టీలకు చెందిన నాయకులు కూడా పోలింగ్ కేంద్రాల ఆవరణలోనికి నేరుగా వచ్చి ఓటర్లను ప్రభావితం చేయడం కనిపించింది. గౌరీపట్నం పోలింగ్ బూత్ వద్ద టీడీపీ, వైసీపీ నేతల మధ్య తలెత్తిన వివాదం ఘర్షణకు దారితీసి, కొట్టుకునే స్థాయికి చేరింది. ఈ దశలో పోలీసులు గౌరీపట్నం చేరుకుని వివాదాన్ని సర్దుబాటు చేయడంతో పరిస్థితి సాధారణ స్థితికి చేరుకుంది.

వర్షంలోనూ కొనసాగిన ఓటింగ్

మండలంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు అరగంట పాటు ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. ఒక పక్క పోలింగ్ జరుగుతుండగానే మరోవంక వర్షం కురవడంతో ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షానికి పట్టణంలోని పిళ్లావారితోట పోలింగ్ కేంద్రంలో స్వల్పంగా తోపులాట జరిగింది. జనరేటర్ సదుపాయం లేకపోవడంతో కొద్దిసేపు పోలింగ్‌కు అంతరాయం ఏర్పడింది. లక్కవరం, గోవాడల్లో పోలింగ్ మందకొడిగా సాగడంతో రాత్రి 8గంటల వరకూ పోలింగ్ కొనసాగుతూనే ఉంది.


మాకవరపాలెం : శెట్టిపాలెంలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు


చీడికాడలో ఓటువేసిన టీడీపీ నాయకులు పీవీజీ కుమార్


చీడికాడ పెదగోగాడలోఓటు వేసిన మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణ

బుచ్చెయ్యపేట : ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు సోమవారం ఉదయం ఏడు గంటల నుంచే ఓటర్లు బారులు తీరారు. ఎండను సైతం లేక్కచేయకుండా ఉత్సహంగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు వడ్డాదిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. దిబ్బిడి, బంగారుమెట్టలలో ఈవీఎంలు గంట సేపు మొరాయించడంతో ఓటింగ్ నిలిచిపోయింది. ఈవీఎంని సరిచేయడంతో ఓటింగ్ సాగింది.

రావికమతం : స్వల్ప అవాంతరాలు, అభ్యంతరాలు మినహా సోమవారం పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది. చినపాచిల, గొంప, కొత్తకోటలలో ఓ బూత్‌లో ఈవీఎం పనిచేయకపోవడంతో గంట పాటు పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. సాయంత్రం గాలులతో కూడిన వర్షం కురవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. జనరేటర్ సదుపాయం లేక కిత్తంపేట, మర్రివలస గ్రామాల పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు చీకట్లోనే ఉన్నారు. గంటల తరబడి సెల్‌ఫోన్ల లైట్లు వెలుతురులో ఉన్నారు. పలువురు గ్రామస్థులు చివరకు ఇళ్లలో ఉన్న చార్జింగ్ లైట్లు తీసుకు రావడంతో రాత్రి పది గంటల వరకూ పోలింగ్ కొనసాగింది. అలాగే మేడివాడ, మరుపాక, చినపాచిల, టి.అర్జాపురం పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరడంతో జనరేటర్లతో రాత్రి పది గంటల దాటిన పోలింగ్ కొనసాగింది. అంతకు ముందు రావికమతం, పి.పొన్నవోలు గ్రామాలలో పోలింగ్ ఏజెంట్లుగా రాజీనామా చేసిన గ్రామ వలంటీర్లను నియమించడంతో టీడీపీ వర్గీయుల అభ్యంతరం తెలిపారు. దీంతో ఇక్కడ స్వల్ప ఘర్షణ జరగడంతో పోలింగ్ కాస్త ఆలస్యమైంది. కొత్తకోటలో పోలింగ్ కేంద్రం వద్ద వరుసలో ఉన్న ఓటర్లకు రాజీనామ చేసిన వలంటీర్లు వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేయడంపై నియోజకవర్గ టీడీపీ మహిళా అధ్యక్షురాలు నీలవేణి తదిరులు అభ్యంతరం వ్యక్తం చేశారు. కూటమి పార్టీల అభ్యర్థులు సీఎం రమేష్, కేఎస్ఎన్ఎస్ రాజు ఎన్నికల సరళిని పరిశీలించారు.

రోలుగుంట : మండలంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా సాగింది. ఉదయం ఏడు గంటల నుంచి ప్రారంభమైన పోలింగ్ బీబీపట్నం, జె.నాయుడుపాలెం, జేపీ అగ్రహారం గ్రామాల్లో రాత్రి తొమ్మిది వరకు కొనసాగింది. మిగతా గ్రామాల్లో ఆరు గంటలకే ముగిసింది. బలిజిపాలెంలో తహసీల్దార్ రవిచంద్ర పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. బీబీపట్నంలో అధికారులు సరైన వసతులు కల్పించకపోవడంతో ఎండలోనే ఓటర్లు ఓటు వేసేందుకు నిలబడాల్సి వచ్చింది. శరభవరంలో ప్రత్యేకంగా గిరిజన గ్రామాల నుంచి ఓటర్లను ప్రత్యేక వాహనాల్లో తరలించి ఓటు వేయించారు. ఇదిలావుంటే, మండలంలోని అర్ల పంచాయతీ శివారు కొండ శిఖర గ్రామాలైన పిత్రిగెడ్డ, నీళ్లబంద గిరిజనులు ఓటును వినియోగించుకోవడానికి తీవ్ర అవస్థలు పడ్డారు. ఆయా గ్రామాల్లో సుమారు 50మంది వరకు ఓటర్లు ఉన్నారు. వీరికి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న శరభవరంలో ఓట్లు వేయడానికి పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కాగా, ఆయా గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో పంచాయతీ కేంద్రం అర్ల వరకు కాలి నడకన చేరుకున్నారు. నడవలేని వృద్ధులను డోలీపై మోసుకుంటూ వచ్చారు. అధికారులు అర్ల నుంచి వాహనాలను ఏర్పాటు చేసి శరభరం తీసుకువచ్చి ఓట్లు వేయించారు. గతంలో పంచాయతీ కేంద్రంలోనే పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని గిరిజనులు ఆందోళనలు సైతం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు రోడ్డు సౌకర్యం కల్పించాల్సిందిగా వారంతా వేడుకున్నారు.

మాడుగుల నియోజకవర్గంలో...

మాడుగుల/ మాడుగుల రూరల్, మే 13 : మండలంలో సోమవారం ఎన్నికలు ప్రశాంతంగా సాగాయి. ఉదయం ఏడు గంటలకే పోలింగ్ ప్రారంభం కావాల్సి ఉండగా, పలుచోట్ల ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ప్రక్రియ ఆలస్యంగా ప్రారంభమైంది. మాడుగుల 26వ బూత్, పొంగలిపాక, సత్యవరంతో పాటు పలు చోట్ల పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో అరగంటసేపు సమయం వృథా అయింది. దీంతో ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఆలస్యంగా పోలింగ్ ప్రారంభం కావడం వల్ల సాయంత్రం ఆరు గంటల తర్వాత కూడా పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. ఇదిలావుంటే, వీరనారాయణంలో ఒకే భవనంలో మూడు గదుల్లో మూడు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయడంతో వరండాలో, బయట వేచి ఉండేందుకు ఓటర్లు ఇబ్బంది పడ్డారు. ఇక్కడ 2346 మంది ఓటర్లు ఉండడంతో స్థల సమస్య ఏర్పడింది. అలాగే జంపెనలో ఒక్క గదిలో పోలింగ్ బూత్ ఒకటే ఏర్పాటు చేయడంతో ఓటర్లు ఇబ్బంది పడ్డారు. ఇదిలావుంటే, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు చీడికాడ మండలం అప్పలరాజుపురంలో ఓటు వేశారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్, ఆయన సతీమణి సత్యవతిలు చీడికాడలో ఓటు వేశారు. టీడీపీ నాయకుడు పైలా ప్రసాదరావు మాడుగులలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.


చీడికాడ : అప్పలరాజుపురంలో ఓటు వేసిన గవిరెడ్డి, చిత్రంలో బండారు


నర్సీపట్నం ఆర్‌సీఎం స్కూల్‌లో పోలింగ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

దేవరాపల్లి : మండలంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. దేవరాపల్లిలోని జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన 127 పోలింగ్ కేంద్రంలో ఈవీఎం రెండుసార్లు మోరాయించడంతో గంటన్నర పాటు ఎన్నిక నిలిచిపోయింది. ఉదయం ఏడు గంటలకే ఓటర్లు ఓటు వేసేందుకు బారులు తీరారు. దేవరాపల్లిలోని 129వ బూత్‌లో ఉదయం నుంచి రాత్రి వరకు మందకొడిగా ఎన్నిక సాగింది. నాగయ్యపేటలో 142 పోలింగ్ కేంద్రంలో అదే విధంగా సాగింది. దేవరాపల్లి, కాశీపురం పోలింగ్ కేంద్రాలను కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ ఓటింగ్ సరళిని తెలుసుకున్నారు.

ఇదిలావుంటే, దేవరాపల్లి సమీపంలోని రైవాడ జాశయం ఆవలి ఒడ్డున ఉన్న రెండు గిరిజన గ్రామాల ఓటర్లు బోటులో జలాశయంలో ప్రయాణం చేసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతగిరి మండలం జీనబాడు పంచాయతీకి చెందిన వలసగరువు నుంచి ఇరవై మంది ఓటర్లు బోటులో వచ్చి జీనబాడులో ఓటు హక్కును వినియోగించుకున్నారు. పినకోట పంచాయతీ కొత్తబురగ గ్రామానికి చెందిన 30 మంది బోటులో పినకోట వచ్చి ఓటు వేశారు.

చీడికాడ : మండలంలోని కోనాం, తంగుడుపల్లి పోలింగ్ కేంద్రాలు మినహా మిగతా అన్ని కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మండుతున్న ఎండను సైతం లెక్కచేయకుండా ఓటర్ల పోలింగ్ కేంద్రాల వద్ద బారులుతీరారు. పెదగోగాడ, చుక్కపల్లి కేంద్రాలతో పాటు మరికొన్ని కేంద్రాల్లో వృద్ధులను కేంద్రాల వరకూ ఆటోలపై తీసుకువచ్చి, అక్కడి నుంచి వీల్‌చైర్ ద్వారా సహాయకులు, వైద్య సిబ్బంది కేంద్రం లోపలికి తీసుకు వెళ్లి ఓటు వేయించారు. కాగా, సుమారు 99 ఏళ్ల వయస్సు గల రాష్ట్ర మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణ తమ కుటుంబ సభ్యుల సహకారంతో పెదగోగాడ పోలింగ్ కేంద్రం వద్ద ఓటు వేశారు. అప్పలరాజుపురం కేంద్రం వద్ద మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు ఓటు హక్కు వినియోగించుకోగా ఆ పక్కనే మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి కూడా దగ్గరే ఉన్నారు. చీడికాడలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

కె.కోటపాడు : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ మండలంలో సోమవారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం ఏడు గంటలకే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. కె.కోటపాడు, చౌడువాడ, కింతాడ, ఆనందపురం, గొల్లలపాలెం, కోడూరు, దాలివలస, సూరెడ్డిపాలెం, పాతవలస, మర్రివలస, శృంగవరం, ఆర్‌వీ అగ్రహారం, పిండ్రంగి తదితర గ్రామాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. కె.కోటపాడులోని పోలింగ్ బూత్‌లను అనకాపల్లి ఎంపీ బీజేపీ అభ్యర్థి సీఎం రమేష్ పరిశీలించారు. ఓటర్లకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టారు.


కె.కోటపాడులో ఓటు వేసేందుకు వచ్చిన బాలింత

ఓటేసిన అభ్యర్థులు.. ప్రజాప్రతినిధులు


నర్సీపట్నంలో ఓటేసిన అయ్యన్నకు సిరా ముద్ర వేస్తున్న ఎన్నికల సిబ్బంది


చోడవరంలో ఓటు వేసిన అనంతరం వేలిని చూపుతున్న రాజు

నర్సీపట్నం, మే 13 : నర్సీపట్నం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అయ్యన్నపాత్రుడు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలోని 162 పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా అయ్యన్న మాట్లాడుతూ వార్ వన్ సైడ్ అయిందని, జగన్‌మోహన్‌రెడ్డి భయపడి లండన్ పోతున్నాడని అన్నారు. పోలింగ్ కేంద్రంలో సరైన సౌకర్యాలు కల్పించ లేదని, ఓటర్లకు కనీసం తాగునీరు ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ పెదబొడ్డేపల్లిలోని ఆర్‌సీఎం స్కూల్‌లో ఓటు వేశారు. ముప్పై వేల మెజార్టీ వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

చోడవరం : పట్టణంలోని కోటవీధి పోలింగ్ బూత్‌లో టీడీపీ అభ్యర్థి కేఎస్ఎన్ ఎస్ రాజు ఓటు వేశారు. అలాగే, మండలంలోని అంభేరుపురంలో వైసీపీ అభ్యర్థి కరణం ధర్మశ్రీ తన ఓటు హక్కు వినియోగించుకున్నారు.

దేవరాపల్లి : మండలంలోని తారువ గ్రామంలో వైసీపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు ఓటు హక్కును వినియోగించుకున్నారు.


చోడవరం : అంభేరుపురంలో ఓటు కోసం వచ్చిన ధర్మశ్రీ


దేవరాపల్లి : తారువలో ఓటు అనంతరం వేలు చూపుతున్న బూడి

రాష్ట్రంలో కూటమి విజయం తథ్యం


నాతవరంలో మాట్లాడుతున్న సీఎం రమేష్

నాతవరం, మే 13 : సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయం తథ్య మని అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ అన్నారు. సోమవారం నాతవరంలో మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తాను వంద పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించినట్టు చెప్పారు. ప్రజలు కూటమివైపు మొగ్గు చూపుతున్నట్టు స్పష్టంగా తెలుస్తుందన్నారు. రాష్ట్రంలో 150 ఎమ్మెల్యే సీట్లు, 24 ఎంపీ సీట్లు కూటమి అభ్యర్థులు కైవసం చేసుకోవడం తథ్యమన్నారు.

బుచ్చెయ్యపేట : కూటమి అభ్యర్థులకు ఓటర్లు కసిగా ఓటేశారని అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ అన్నారు. వడ్డాది పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ సరళిని చోడవరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో కూటమి క్లీన్‌స్వీప్‌తో విజయకేతనం ఎగురవేయడం తథ్యమన్నారు.

గొలుగొండ : ఎన్నికల్లో కూటమిదే విజయమని నర్సీపట్నం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు జోష్యం చెప్పారు. మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ జరుగుతున్న తీరును సోమవారం పరిశీలించారు. అనంతరం చీడిగుమ్మలలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి 124 అసెంబ్లీ, 21 ఎంపీ సీట్లు గెలవడం తథ్యమన్నారు. నర్సీపట్నంలో 20 వేల మెజార్టీతో టీడీపీ విజయం తథ్యమన్నారు.

దేవరాపల్లి : వైసీపీని గద్దె దింపాలన్న కసితో రాష్ట్రంలోని ఓటర్లు మండుటెండను సైతం లెక్కచేయక ఓట్లు వేసేందుకు ముందుకు వచ్చారని మాడుగుల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యన్నారాయణమూర్తి అన్నారు. దేవరాపల్లిలో సోమవారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలంతా అభివృద్ధిని కోరుకుంటున్నారన్నారు. అందుకే పెద్ద సంఖ్యలో వచ్చి ఓట్లు వేశారన్నారు. ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయం తథ్యమన్నారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, నాయకులు సూర్యనారాయణ, కృష్ణమూర్తి, అర్జునరావు, మురళి తదితరులు ఉన్నారు.


నర్సీపట్నం మండలం వేములపూడిలో ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యేముత్యాలపాప


బుచ్చెయ్యపేట : వడ్డాదిలో ఓటు వేసిన తాతయ్యబాబు

ఎవరి ధీమా వారిది!!

... 5వ పేజీ తరువాయి

అభ్యర్థిగా కూటమి తరఫున పోటీ చేసిన టీడీపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్ కనీసం 50 వేల నుంచి లక్ష ఓట్ల మెజారిటీతో గెలుస్తారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎంపీ అభ్యర్థులకు రెండు పార్టీలలోను క్రాస్ ఓటింగ్ జరిగినట్టు సమాచారం. భీమిలి, గాజువాక, విశాఖ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో కొందరు ఓటర్లు ఎమ్మెల్యే అభ్యర్థికి ఒక పార్టీకి ఓటు వేసి, ఎంపీ అభ్యర్థికి వేరే పార్టీకి వేసినట్టు ప్రచారం జరుగుతోంది. చాలామంది వైసీపీ అభిమానులు ఎమ్మెల్యే ఓటు ఆ పార్టీకే వేసి ఎంపీ ఓటు టీడీపీకేసినట్టు చెబుతున్నారు.

విశాఖ తూర్పులో హోరాహోరీ

విశాఖ తూర్పు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు కనీసం 20 వేల ఓట్ల మెజారిటీతో గెలిచి హ్యాట్రిక్ సాధిస్తారని ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి. అయితే వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఎంవీవీ సత్యనారాయణకు ఓటమి చరిత్ర లేదని, ఆయనే తూర్పులో విజయం దక్కించుకుంటారని ఆయన వర్గం ఘంటాపథంగా చెబుతోంది.

భీమిలిలో గంట మోగనుందా?

భీమిలి నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు భారీ మెజారిటీతో గెలుస్తారని ఆ పార్టీ నాయకులు అంటున్నారు. జిల్లాలో ఆయనకే ఎక్కువ మెజారిటీ వస్తుందని ధీమా వ్యక్తంచేస్తున్నారు. అయితే అదంతా ప్రచారమేనని వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి(అవంతి) శ్రీనివాసరావు గెలుపు ఖాయమని వైసీపీ పెద్దలు అంటున్నారు.

గాజువాకలో పల్లాకు మొగ్గు

గాజువాకలో వైసీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్‌కు పరాభవమే మిగులుతుందని, టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు విజయం ఖాయమైపోయిందని విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. మంత్రిగా ఉండి అమర్‌నాథ్ జిల్లా ఏమీచేయలేకపోయారనే విమర్శలు ఉన్నాయి.

పశ్చిమంలో టైట్ ఫైట్

పశ్చిమ నియోజవర్గంలో టీడీపీ, వైసీపీ అభ్యర్థుల మధ్య గట్టి పోటీ జరిగింది. మూడోసారి ఎమ్మెల్యేగా గెలవాలని టీడీపీ అభ్యర్థి గణబాబు సర్వశక్తులు ఒడ్డగా, ఈసారి శాసనసభకు వెళ్లాలని వైసీపీ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ గట్టి ప్రయత్నమే చేశారు. ఎక్కడా ఖర్చుకు వెనుకాడలేదు. మల్కాపురం, సింధియా తదితర పారిశ్రామిక ప్రాంత ప్రజలు ఎవరికి అండగా నిలిస్తే వారే గెలుస్తారనేది టాక్. ఇద్దరిలో ఎవరు గెలిచినా అతి తక్కువ ఓట్ల మెజారిటీయేనని సమాచారం.

ఉత్తరంలో ఓట్లను చీల్చిన జైభారత్

విశాఖ ఉత్తర నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు, వైసీపీ అభ్యర్థి కేకే రాజు గెలుపు కోసం హోరాహోరీ పోరాటం చేశారు. అయితే ఇక్కడ జైభారత్ పార్టీ తరఫున వీవీ లక్ష్మీనారాయణ పోటీలో నిలిచారు. ఆయన చీల్చే ఓట్లు తీవ్ర ప్రభావం చూపనున్నాయి.

విశాఖలో జనసేన జెండా రెపరెపలు

విశాఖ జిల్లాలో ఈసారి జనసేన జెండా ఎగురుతుందని ఆ పార్టీ వర్గాలు ఆనందం వ్యక్తంచేస్తున్నాయి. దక్షిణ నియోజకవర్గంలో ఆ పార్టీ తరఫున పోటీ చేస్తున్న వంశీకృష్ణ శ్రీనివాస్ తొలుత కాసింత ఇబ్బంది ఎదుర్కొన్నా ఆ తరువాత బాగా పుంజుకున్నారు. టీడీపీ సహకారంతో పాటు వైసీపీ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే వ్యతిరేకులు కలిసి రావడం అదృష్టంగా మారింది.

పెందుర్తిలో సామాజిక వర్గాల వారీగా చీలిక

పెందుర్తి నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు, వైసీపీ అభ్యర్థి అదీప్ రాజుల మధ్య నువ్వా?, నేనా? అనే పోటీ జరిగినట్టు చెబుతున్నారు. నియోజకవర్గంలోని మండలాల్లో ఓటర్లు సామాజికవర్గాలకు ప్రాధాన్యమిస్తూ తమ వారికి అనుకూలంగా ఓటింగ్ చేశారు.

అధికార పార్టీ అభ్యర్థిపై తీవ్రమైన భూకబ్జాల ఆరోపణలు ఉన్నందున అవే తనకి మైనస్‌గా మారాయని చెబుతున్నారు. పంచకర్లకు టీడీపీ నుంచి బలమైన సాయం ఉండటంతో జనసేనకి జై కొట్టిస్తారని అంటున్నారు.

అనకాపల్లి జిల్లాలో గెలుపెవరిదో?

... 5వ పేజీ తరువాయి

టీడీపీ, జనసేన అభ్యర్థులు అంచనా వేస్తున్నారు. అయితే సంక్షేమ పథకాలు తమను గెలిపిస్తాయని వైసీపీ అభ్యర్థులు మలసాల భరత్‌కుమార్(అనకాపల్లి), కన్నబాబురాజు (ఎలమంచిలి), కరణం ధర్మశ్రీ(చోడవరం), పెట్ల ఉమాశంకర్ గణేశ్(నర్సీపట్నం), కంబాల జోగులు(పాయకరావుపేట), ఈర్లె అనురాధ(మాడుగుల), అదీప్‌రాజ్(పెందుర్తి) నమ్మ కంతో ఉన్నారు. జిల్లాలో ఎవరు విజయం సాధిస్తారనే దానిపై జోరుగా చర్చ సాగుతోంది.

పాడేరు, అరకులోయలోనూ అదే ధీమా

పాడేరు, మే 13 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో పాడేరు, అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గాల్లో తమ పార్టీకి ఎంత మేరకు ఓట్లు పడ్డాయనే అంచనాలను రూపొందించడంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు, శ్రేణులు నిమగ్నమయ్యారు. అలాగే ఎవరికి వాళ్లు తమదే గెలుపనే ధీమాతో ఉన్నారు. కాగా పాడేరు అసెంబ్లీ స్థానంలో కూటమి గెలుపు ఖాయమని టీడీపీ అభ్యర్థి గిడ్డి ఈశ్వరి పేర్కొంటున్నారు. అయితే తాను అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తానని వైసీపీ అభ్యర్థి విశ్వేశ్వరరాజు ధీమా వ్యక్తం చేస్తున్నారు. జగన్ పాలనపై వ్యతిరేకత, గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి లేకపోవడం, వైసీపీ అభ్యర్థికి నియోజకవర్గంపై సంపూర్ణ పట్టులేకపోవడం, సీనియర్ నేతల సహాయ నిరాకరణ వంటి అంశాలతో పాటు తమ అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్, కూటమి మేనిఫెస్టో ప్రభావం, కూటమి శ్రేణుల కృషి తనకు కలిసొస్తుందని టీడీపీ అభ్యర్థి అభిప్రాయపడుతున్నారు. అలాగే పలువురు అంచనాలు సైతం పాడేరులో టీడీపీ పాగా వేస్తుందనే అంటున్నారు.

అరకులోయలో..

అరకులోయ అసెంబ్లీ స్థానంలో వైసీపీ రెబల్, స్వతంత్ర అభ్యర్థుల ప్రభావంతో ఓట్లలో చీలిక కారణంగా ఎవరు గెలుస్తారనేది కచ్చితంగా చెప్పలేని పరిస్థితి నెలకొందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. వైసీపీ అభ్యర్థి రేగం మత్స్యలింగం సామాజిక వర్గానికి చెందిన వాళ్లయిన బీజేపీ అభ్యర్థి పాంగి రాజారావు, స్వతంత్ర అభ్యర్థి సివేరి అబ్రహం పోటీలో ఉండడంతో భారీగా చీలాయని తెలుస్తున్నది. మరో సామాజిక వర్గానికి చెందిన కాంగ్రెస్ అభ్యర్థి శెట్టి గంగాధరస్వామి, మరో స్వతంత్ర అభ్యర్థి సమర్థ రఘునాథ్‌లు సైతం వైసీపీ ఓట్లను బారీగానే చీల్చారని అంటున్నారు. దీంతో ఎవరెవరికి ఎన్ని ఓట్లు పడ్డాయనేది కచ్చితంగా అంచనా వేయలేకపోతున్నారు. దీంతో గెలుపు ఎవరిదనే విషయం తెలియడం లేదంటున్నారు. కానీ కూటమి శ్రేణుల సహకారంతో తాను గెలుస్తానని పాంగి రాజారావు అంటుండగా, నియోజకవర్గంలో తమ పట్టుసడల లేదని, తమదే విజయమని వైపీపీ అభ్యర్థి రేగం మత్స్యలింగం అంటున్నారు. ఇలా ఎవరికి వాళ్లు గెలుస్తామనే ధీమాతో ఉన్నారు. అయితే ఈసారి ఎన్నికల్లో ఓటింగ్ శాతం తగ్గడం సైతం ఎవరికి లాభిస్తుందో... ఎవర్ని ముంచేస్తుందోననే చర్చ మన్యంలో జోరుగా జరుగుతున్నది.